

## వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

వరంగల్ వాయిస్ నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్-మంజుల దంపతుల 32వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారికి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టులు వెన్ను రాము, గోలి రవి, సిద్దోజు రాకేష్, పూజారి విజయ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆది దంపతులుగా ఉంటూ భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 276 బుధవారం | 15 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




2లో

## సామ్రాజ్యలక్ష్మిగా అమ్మవారు

ఆరో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు

ఉభయ దాతలుగా వ్యవహరించిన కుమ్మరి సంఘం



8లో

## స్ట్రాంగ్ రూంల తనిఖీ

లాగ్ బుక్‌లను పరిశీలించిన కలెక్టర్



8లో..

## త్వరలో కొత్త రేషన్ కార్డులు

బియ్యంతోపాటు మరి కొన్ని సరుకుల పంపిణీ

సీఎం రేవంత్ రెడ్డి

# కారులో.. రాకేశ్ రగడ



వివరాలు 2లో..

- ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న ముఖ్య నేతలు
- ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి పలువురు డుమ్మా
- మాజీ మంత్రితో సహా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గైర్హాజర్
- కేటీఆర్ ఒత్తిడితో హాజరైన దాస్యం
- పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో బయటపడిన లుకలుకలు

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక భారత రాష్ట్ర సమితికి పరీక్షగా మారింది. సిట్టింగ్ సీటును తిరిగి కైవసం చేసుకోవాలనే పట్టుదలతో గులాబీ దళం వ్యూహ రచన చేస్తుంటే నేతలు మాత్రం ఎట్టి పరిస్థితిలో సహకరించేది లేదంటూ తేల్చి చెబుతున్నారు. మొదటినుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ముఖ్యనేతలంతా వ్యతిరేకిస్తున్నారు. బుధవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్ లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి సైతం పలువురు సీనియర్లు డుమ్మా కొట్టారు. మూడు జిల్లాలకు చెందిన 130 మంది ముఖ్యులకు ఆహ్వానం పంపితే కేవలం 50మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు సైతం సన్నాహక సమావేశానికి హాజరు కాలేదు. కేటీఆర్ ఒత్తిడితో ప్రభుత్వ మాజీ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ హాజరైనా అంటీ ముట్టనట్టే వ్యవహరించారు. ఇప్పటికే అధికారానికి దూరమైన బీఆర్ఎస్‌కు రాకేష్ రెడ్డి లొల్లి మరో తలనొప్పిగా మారింది.

- వరంగల్ వాయిస్, వరంగల్

# కారులో..
# రాకేశ్ రగడ

**ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న ముఖ్య నేతలు**

**ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి పలువురు డుమ్మా**

**మాజీ మంత్రితో సహా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గైర్హాజర్**

**కేటీఆర్ ఒత్తిడితో హాజరైన దాస్యం**

**పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో బయటపడిన లుకలుకలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ లో లుకలుకలు బయటపడ్డాయి. నచ్చని అభ్యర్థిని బరిలో నిలిపారంటూ ముఖ్యనేతలంతా అలకబూనారు. పల్లా వర్గానికి చెందిన ఏనుగుల రాకేశ్ రెడ్డికి టికెట్ కేటాయించడంపై మెజార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని మార్చుకుంటే సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. ఉద్యమ సమయంనుంచి పార్టీకోసం పనిచేసిన వారిని కాదని నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వారికి టికెట్ ఎలా కేటాయిస్తారంటూ నిలదీస్తున్నారు. కొందరు పని గట్టుకొని పార్టీని ఓడించేందుకే డమ్మీ క్యాండిడేట్ గా రాకేశ్ రెడ్డిని బరిలో నిలిపారంటూ బీఆర్ ఎస్ సీనియర్ నేతలు ఆరోపిస్తున్నారు.

## పల్లా రాజీనామాతో..

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2027 వరకు ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం ఉన్నా పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక అనివార్యమైంది. దీనికోసం ఇటీవల ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 27న ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఈసీ సర్వం సిద్ధం చేస్తోంది.



వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

## నేతలు గైర్హాజర్..

ఎంపీ ఎన్నికలు ముగియడంతో ప్రధాన పార్టీలు ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై దృష్టి పెట్టాయి. అందులో భాగంగా బీఆర్ ఎస్ చీఫ్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో బుధవారం సన్నాహక సవావేశం ఏర్పాటు చేశారు. ఇందుకు గాను 130 మందికి ఆహ్వానం పంపితే కేవలం 50మంది మాత్రమే హాజరయ్యారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, బస్వరాజు సారయ్య, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, బొల్లం సంపత్ కుమార్, కె.వాసుదేవరెడ్డి, సుందర్ రాజ్ యాదవ్ తదితరులు సన్నాహక సమావేశానికి డుమ్మా కొట్టారు.

## కేటీఆర్ ఒత్తిడితో..

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి ప్రభుత్వ మాజీ చీఫ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ సైతం దూరంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు ఫోన్ చేసి సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. కేటీఆర్ ఒత్తిడితో సన్నాహక సమావేశానికి హాజరైన ఆయన అంటీ ముట్టనట్లు వ్యవహరించినట్లు సమాచారం.

## 4,61,806 ఓటర్లు..

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 4,61,806 ఓటర్లు ఈనెల 27న తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 2,87,007 మంది పురుషులు కాగా, 1,74,794 మంది మహిళలున్నారు. ఖమ్మి జిల్లాలో అత్యధికంగా 83,606 మంది పట్టభద్ర ఓటర్లుండగా, సిద్ధిపేటలో అత్యల్పంగా 4,671 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు.

## 27న పోలింగ్..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఈనెల 27న పోలింగ్ జరుగనుంది. ఇందుకుగాను ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. కాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో మొత్తం 52మంది నిలిచారు. ఇందుకుగాను మొత్తం 63మంది నామినేషన్లు దాఖలు చేయగా 11మంది ఉపసంహరించుకున్నారు. తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించగా, బీజేపీ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీఆర్ఎస్ ఏనుగుల రాకేశ్ రెడ్డికి మద్దతిస్తోంది. జూన్ 5న కౌంటింగ్ నిర్వహించనున్నారు.


వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

**వరంగల్ -ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల వివరాలు**

| జిల్లా | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| సిద్దిపేట | 3,118 | 1,553 | 00 | 4,671 |
| జనగామ | 14,862 | 8,457 | 01 | 23,329 |
| హనుమకొండ | 25,608 | 17,875 | 00 | 43,483 |
| వరంగల్ | 26,907 | 16,687 | 00 | 43,594 |
| మహబూబాబాద్ | 22,842 | 11,917 | 00 | 34,759 |
| ములుగు | 6,558 | 3,679 | 00 | 10,237 |
| జయశంకర్‌భూపాలపల్లి | 7,956 | 4,504 | 00 | 12,460 |
| భద్రాద్రి కొత్తగూడెం | 22,486 | 17,412 | 00 | 39,898 |
| ఖమ్మం | 50,517 | 33,085 | 04 | 83,606 |
| యాదాద్రి భువనగిరి | 20,740 | 13,186 | 00 | 33,926 |
| సూర్యాపేట | 34,043 | 17,250 | 00 | 51,293 |
| నల్లగొండ | 51,370 | 29,189 | 00 | 80,559 |
| మొత్తం | 2,87,007 | 1,74,794 | 05 | 4,61,806 |

# సామ్రాజ్యలక్ష్మిగా అమ్మవారు

**ఆరో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు**

**ఉభయ దాతలుగా వ్యవహరించిన కుమ్మరి సంఘం**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నాలుగు గంటలకు అమ్మవారికి నిత్యహనికం నిర్వహించిన తదుపరి చతుస్థానార్చన జరిపిన తర్వాత అమ్మవారికి గందోత్సవం, సాయంకాలం సాలభంజిక వాహనంపై అమ్మవారిని సామ్రాజ్యలక్ష్మిగా అలంకరించి ఊరేగింపు జరిపారు. శాలభంజిక వాహనం మీద 32 మంది దేవకన్యలు వేసే ప్రశ్నల వర్షానికి ప్రత్యుత్తరమిస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తన సర్వజ్ఞత్వాన్ని తెలుపుతుంది. సాలభంజిక వాహనం మీద సేవింపబడుతున్న అమ్మవారిని దర్శిస్తే సకల శక్తులు సమకూరుతాయని, విద్యా, ఐశ్వర్యం, పరాక్రమం, అధికారం అన్ని సమకూరుతాయని, సామ్రాజైశ్వర్యం కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అమ్మవారి చందనోత్సవంతో భక్తులకు శ్వాసకోశ, చర్మ సంబంధమైన రుగ్మతలు తగ్గిపోతాయన్నారు. దేవాలయానికి చేసిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, చల్లటి తాగునీరు అమ్మవారి దర్శనం తదితర ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి శేషు భారతి పర్యవేక్షించారు. ఈరోజు కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర, వరంగల్ ఉమ్మడి జిల్లా కుమ్మరి సంఘం వారు ఉభయ దాతలుగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఉపాధ్యక్షులు ఆవునూరు రామ్మూర్తి, వరంగల్ జిల్లా అధ్యక్షులు రుద్రారపు కుమారస్వామి, కడారి ఓం ప్రకాష్, తౌటి దేవేందర్, వడ్లూరి విష్ణు, ఆకారపు రాజగోపాల్, ఆకారపు శ్రీనివాస్, వడ్లూరి సత్యం, ఉర్సు కుమ్మరి సంఘం అధ్యక్షులు ఆవునూరి నాగరాజు, కందికొండ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు కుమ్మరికుల ముఖ్యులు ఆమంచి నాగ పరిమళ, ఆమంచి రాజ్ ప్రదీప్, ఆమంచి అనసూయ సౌజన్యంతో సుమారు 700 మందికి అన్నదానం నిర్వహించారు.

# అంగన్‌వాడీ టీచర్..
# అనుమానాస్పద మృతి



**వరంగల్ వాయిస్, తాడ్వాయి:** అంగన్వాడీ ఉపాధ్యాయిని హత్యకు గురైన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటాపురంలోని 3వ అంగన్ వాడి సెంటర్ లో రడం సుజాత (48) అంగన్వాడీ టీచర్ విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె విధులు ముగించుకుని తన స్వగ్రామమైన ఏటూరునాగారం బయలుదేరారు. కాని అమె ఇంటికి చేరుకోలేదు. ఈ క్రమంలో అమె కాటాపురం గ్రామ శివారులో ఓ చెట్టు కింద శవమై పడివుంది. బుధవారం ఉదయం తాడ్వాయి సమీపంలో అడవికి వెళ్లిన తునికాకు కూలీలకు సుజాత మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి మెడకు స్కార్ఫ్‌ను చుట్టి ఉరి వేసినట్లు గుర్తించారు. సుజాతకు చెందిన నాలుగు తులాల బంగారం, సెల్ఫోన్ చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

## ఉపాధ్యాయులపై దాడి సరైనది కాదు



**వరంగల్ వాయిస్, నడికూడ :** ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఏక రీతిన టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జి చేయించడం సరైనది కాదని పీఆర్టీయూ నడికూడ మండల శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీఓ, ఏపీఓలకు రోజుకు రూ.600, ఓపీఓలకు రూ.400 రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం. 691ని ఈ నెల 11 న విడుదల చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారమే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో పీఓ, ఏపీఓలకు రూ.3150 లు చెల్లించగా, నారాయణఖేడ్ లో రూ.2400 మాత్రమే ఇచ్చారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు విరుద్ధంగా సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో తక్కువ పారితోషకం చెల్లించడం సరైనది కాదని అన్నారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు ఉపాధ్యాయులు, ఉద్యోగులపై ఎవరి ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని ప్రశ్నించారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు ఎప్పుడు ఎక్కడ జరగకుండా అదేవిధంగా ఎలక్షన్స్ అయిన రోజే ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇప్పించే విధంగా ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలి

### ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల కోసం సమస్యలపై పోరాడే వ్యక్తి, గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు నుంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ గుర్తించి నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా నియమించడం సంతోషకరమైన విషయమని కాంగ్రెస్ నేత బొచ్చు జెమిని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త కంకణం కట్టుకొని తీన్మార్ మల్లన్న మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలుపుకు సహకరించే విధంగా కృషి చేయాలని బుధవారం 02వ వార్డులో సోషల్ మీడియా 2వ వార్డు కోఆర్డినేటర్ బొచ్చు జెమిని ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, పరకాల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్ మాట్లాడుతూ దీనిలో భాగంగా ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండల పరిధిలోని గ్రామంలో పట్టభద్రులైన వారిని గుర్తించి, ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేస్తూ తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఎమ్మెల్సీ ఓటు వేసే విధంగా, సహకరించే విధంగా పనిచేయాలని, పట్టభద్రుల చదువుకున్న గ్రాడ్యుయేట్స్ గల ఓటరును కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 02వ వార్డు కాంగ్రెస్ నాయకులు బండారి పవన్, బొమ్మకంటి రాజు, బొచ్చు సారయ్య పాల్గొన్నారు.

## బైక్ దొంగతనం కేసులో ఒకరికి జైలు


**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా మచిలీపట్నం శివారు పాత రామన్నపేటకు చెందిన ఒకరికి తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఒక సంవత్సరం శిక్షతో పాటు జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై తహెర్ బాబా తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 2023వ సంవత్సరంలో మరిపెడ బంగ్లాకు చెందిన షేక్ సలీం ఈద్గా బజార్ లో గల తన ఇంటి ముందు తన ద్విచక్ర వాహనం పెట్టి పడుకొని తెల్లవారి లేచి చూసేసరికి కనిపించ లేదు. దీంతో ఎవరో దొంగిలించారని, ఆ విషయంపై మరిపెడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పవన్ కుమార్ కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం కోర్ట్ లో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్ట్ లో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేష్ ఆనంద్ వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత రెంటాల నాగేంద్రబాబుకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్ట్ కానిస్టేబుల్ రామ్ నారాయణను తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ హతిరాం, ఎస్ఐ తహేర్ బాబా అభినందించారు.

# ఘనంగా శ్రీరాధా కృష్ణదేవాలయ వార్షికోత్సవ వేడుకలు

**వరంగల్ వాయిస్, కాజీపేట :** పట్టణంలోని 62వ డివిజన్ సోమిడి శ్రీరాధాకృష్ణ స్వామి దేవాలయంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల దంపతులు శ్రీ జక్కుల రమా రవీందర్యాదవ్ ఆధ్వర్యంలో శ్రీరాధాకృష్ణస్వామి దేవాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా సాంప్రదాయబద్ధంగా ఘనంగా విశిష్ట పూజలు, అభిషేకాలు, హెూమం నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జక్కుల దంపతులు శ్రీ క్రిష్ణ భగవానుడిని కాజీపేట పట్టణ ప్రజలు, 62వ డివిజన్ ప్రజలు అనేక రంగాల్లో అభివృద్ధి చెందాలని, అలాగే వారంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మేరుగు రాజయ్యయాదవ్, పోతరబోయిన అంకూస్ - రాజమ్మ దంపతులు,



పోతరబోయిన ప్రవళిక- విజయ్ యాదవ్ దంపతులు, ఒజ్జ కరుణాకర్-అనూష దంపతులు, శివరాం, రాజు, భక్తులు, స్థానికులు, పాల్గొన్నారు.



## ఉత్తమ క్రికెటర్‌కు బ్యాట్ బహూకరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** గత నెల నుంచి మే నెల 20న హైదరబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరకాల జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న హనుమకొండ జిల్లా ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్ లో భాగంగా శిక్షణ పొందిన క్రికెట్ క్రీడాకారులకు శిక్షణలో భాగంగా అండర్-14, అండర్-16, అండర్-19, ఓపెన్ కేటగిరీ క్రీడాకారులను నాలుగు జట్లుగా విభజించి హనుమకొండ రెవెన్యూ డివిజన్, పరకాల రెవెన్యూ డివిజన్ల మధ్య జరుగుతున్న లీగ్ మ్యాచ్ ను పరకాల సీనియర్ క్రీకెటర్ ఆలూరి ప్రభాకర్ టాస్ వేసి ప్రారంభించారు. మ్యాచ్ అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు దామెర పోలీసు స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ ఇనుగాల రాజు రెడ్డి ముఖ్య అతిథిగా వచ్చి క్యాంప్ లో అత్యుత్తమ ప్రతిభ చూపించిన క్రీడాకారుడికి గంద్ర సాయి ఈశ్వర్ ను ఉత్తమ క్యాంప్ ప్లేయర్ గా, బెస్ట్ బ్యాట్స్ మెన్ గా అల్లం రణధీర్, బెస్ట్ బౌలర్ గా నవదీప్ లకు షీల్డ్స్ ప్రదానం చేశారు. అలాగే క్యాంప్ లో పాల్గొంటున్న దామెర మండలానికి చెందిన క్రికెట్ క్రీడాకారుడుకి ప్రవీణ్ సొంతంగా 5వేల రూపాయల బ్యాట్ ను బహూకరించారు. ప్రతిరోజూ క్యాంప్ లో పాల్గొన్న క్రీడాకారులకు ఆల్పాహారంగా టిఫిన్, అరటి పండ్లు, కోడిగుడ్డు తన వంతుగా అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ బోజ్జం అరుణ్, సమృద్, చింటూ, ఆదర్శ్, తులసి, అలేటి శ్రీనివాస్ తదితులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూములలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రపరచగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం తనిఖీ చేశారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించి అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల షట్టర్ల తాళాలకు వేసిన సీళ్ల ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూములకు సంబంధించిన లాగ్ బుక్ లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఉన్న సీసీ కెమెరాల పర్యవేక్షణకు సంబంధించిన వాచ్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు.పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములు, భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ వివరాలను ఆయా నియోజకవర్గాల ఏఆర్వోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్లు విజయ్ కుమార్, జగన్మోహన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శిశు గృహ పిల్లలకు వస్తువుల వితరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి పసి పిల్లల హెూం శిశుగృహ పిల్లలకు అవసరమైన బట్టలు, పరుపులు బొమ్మలు , డైపర్స్, పాల డబ్బాలు, సబ్బులు, దోమ తెరలు ఇలా పసి పిల్లలకు అవసరమైన ప్రతి ఒక్కటి ఉచితంగా ఏర్పాటు చేశారు. మరో దాత తంగెళ్లపల్లి కిషన్ నరేష్ బొమ్మలు, ఇంకొంత పిల్లల సామాగ్రిని అందించారు. అన్నింటిని శిశుగృహ సిబ్బందికి డాక్టర్ అనితా రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ అంతా ఆడపిల్లి పుట్టిందని వదిలేసిన పిల్లలే ఉంటారని, వారికి అమ్మను కాలేకపోయినా అమ్మ ప్రేమను అందించాలని ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇటీవల ఊరుకొండ గ్రామంలో ఎవరో గుర్తుతెలియని తల్లిదండ్రులు అప్పుడే పుట్టిన ఆడపిల్లను బ్రతికుండగానే భూమిలో పాతిపెట్టిన విషయాన్ని చూసిన స్థానికులు వెంటనే స్పందించి పోలీసులు దృష్టి తీసుకురావడం జరిగింది. సమాజంలోని మానవతా హృదయం ఉన్న వ్యక్తులు అధికారులు వెంటనే స్పందించి ఆ పాపను కాపాడగలిగారు. ముఖ్యంగా ప్రతి తల్లిదండ్రులకు విజ్ఞప్తి మీరు మీ పిల్లలకి జన్మనిచ్చే సందర్భాల్లో మీరు పోషించలేని పరిస్థితిలో ఉన్నట్లయితే ఆ పాపను గాని బాబును గానీ హత్య చేయకుండా బాలల న్యాయ మండలి చట్ట ప్రకారం మీరు స్వచ్ఛందంగా ఆ పిల్లల్ని ప్రభుత్వానికి అప్పగించ వచ్చని తెలిపర్నా. ఈ అప్పగించిన పిల్లలను సమాజంలో ఎవరైతే పిల్లలు లేని దంపతులు ఉంటారో వారికి దత్తత చట్ట ప్రకారం వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఆడపిల్లలను రక్షించే ఉద్యమంలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను అందేటట్లు చూడాలన్నరు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, డోనర్ తంగెళ్లపల్లి కిషన్ నరేష్, దేవరకొండ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆ అధికారి రూటే సపరేటు

## ప్రభుత్వ ఉత్తర్వులను సైతం లెక్కచేయని మహిళా అధికారి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇంటర్ విద్య ఆర్జేడీ ఐఈ వరంగల్ ఆఫీసును హైదరాబాదు లో ఉంచడం కుదరదని ప్రభుత్వం గత నెలలో తిరిగి వరంగల్ కు మార్చాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ (విద్యా శాఖ) ఉత్తర్వులు జారీచేసినా, సదరు ఆఫీసులో పనిచేసే పెద్ద మేడం (ఆర్జేడీ) ప్రభుత్వ ఆదేశాలను సైతం ధిక్కరించి హైదరాబాదులోనే ఆఫీసును కొనసాగించడం వెనుక కారణం ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. వరంగల్ లో ఆఫీస్ ను కొనసాగించడం కోసం గతంలో హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గదులు కేటాయించినా, అందులోకి ఆఫీసును మార్చకుండా ఆ మహిళా అధికారి, ఆర్జేడి ఆఫీసును తన స్వలాభం కోసం వరంగల్ నుంచి హైదరాబాద్ కు మార్చారు. అంతేకాక ఆర్జేడీ ఆఫీసులో పనిచేసే 24 మంది ఉద్యోగులను సైతం ప్రభుత్వానికి తెలియకుండానే ఆ మహిళా అధికారి పలు ఆఫీసులకు కూడా బదిలీ చేసింది. జీతం మాత్రం హనుమకొండ ఎస్ టీఓ నుంచి తీసుకుంటూ, ఉద్యోగం మాత్రం హైదారాబాద్ లో చేస్తూ, నా రూటే సపరేటు అన్నట్లు వ్యవహరిస్తున్న ఆ మహిళా అధికారిని చూస్తే, ఉద్యోగం ఇంటి దగ్గర చేస్తారా? ఆఫీసులో చేస్తారా? ఆఫీస్ ఎక్కడుంటే అక్కడే చేస్తారా? తన కొరకు ఆఫీసునే మార్చుకుంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఇప్పటికైనా సదరు ఉన్నత మహిళా అధికారి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను గౌరవించి హైదరాబాదు నుంచి ఆర్జేడీ కార్యాలయాన్ని వరంగల్ కు మార్చాలని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం నాయకులు, అధ్యాపకులు కోరుకుంటున్నారు.

## వడదెబ్బతో భవన నిర్మాణ కార్మికుడి మృతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని మొగిలిచర్ల గ్రామానికి చెందిన చిలువేరు కమలాకర్ (35) కొన్ని సంవత్సరాల నుంచి భవన నిర్మాణానికి సంబంధించిన సెంట్రింగ్ పని చేస్తున్నాడు. గడిచిన రెండు రోజుల నుంచి ఎండ తీవ్రతలో కూడా పనిచేయడం వలన వడదెబ్బ తగిలి కొంత అస్వస్థతకు గురై బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వీరిది చాలా నిరుపేద కుటుంబం, మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## జేసీబీతో మురుగు నీరు తొలగింపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ ఉప్పరోని కుంట వద్ద గల బాక్స్ డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉండటం వలన మొన్న కురిసిన వర్షం వల్ల ఇండ్లలోకి నీరు వచ్చాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బుధవారం వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బాక్స్ డ్రైన్ లో చెత్తాచెదారాన్ని జేసీబీ ద్వారా తీసివేయడం వల్ల నిలిచి ఉన్న మురుగు నీరు అంతా వెళ్లిపోయాయి. అలాగే, ఉర్సు ప్రసూతి ఆసుపత్రి ముందు చాలా రోజుల క్రితం నిర్మించిన కల్వర్టు కృంగిపోవడం వలన నీరు అంతా నిలిచి ఉండడం వలన కనీలను జేసీబీ ద్వారా తొలగించారు. ఠాగూర్ విద్యా మందిర్ ముందు రోడ్డు ఎగుడు దిగుడు ఉండడం వలన వర్షం నీరు నిలుస్తున్నందున జేసీబీతో సమాంతరం చేయించడం జరిగింది.

## బాధితురాలికి ఐదు లక్షల ఎల్ఓసీ మంజూరు

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన కొల లక్ష్మి ప్రమాదవశాత్తు క్రిందపడగా తలకి బలమైన గాయమైంది. దీంతో వెంటనే హైదరబాద్ నిమ్స్ హాస్పటల్ కు వెళితే అక్కడి డాక్టర్లు కొల లక్ష్మి తలకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. వెంటనే కొల లక్ష్మి కుమారుడు కొల మహేష్ కాళేశ్వరం గ్రామానికి చెందిన భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ శ్రీనివాస్ రెడ్డి, లేతకారి రాజబాబుకు విషయం ఫోన్ లో తెలియజేయడంతో వారు వెంటనే ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి విషయం తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఆయన ఐదు లక్షల రూపాయల ఎల్ఓసీ మంజూరు చేయించారు. దీనికి ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు, బాధితురాలి కుమారుడు కొల మహేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

## తడిచిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తడిచిన వరి ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర అందజేయాలని మహబూబాబాద్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, తొర్రూరు జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు కష్టాలు పట్టించుకోని ప్రభుత్వమని విమర్శించారు. అకాల వర్షం కారణంగా వేలాది క్వింటాళ్ల వరి ధాన్యం తడిచి ముద్దైందని, సమయానికి కాంటా పెట్టక, మిల్లులకు తరలించుటకు లారీలు/ డీసీఎంలు ఏర్పాటు చేయక రోజుల తరబడి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మద్దతు ధర రూ.500 ఇస్తామని ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పుడు రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు కుప్పలుగా రాశులు పోసుకొని ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని ఆరు కాలం పండించుకున్న పంట కండ్ల ముందే తడిసి ముద్దయి అమ్ముకోలేక అవస్థలు పడుతు దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుకు అన్ని విధాల ఆదుకుంటామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతుల ముందు ద్రోహిగా నిలబడిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతూ ముసలి కన్నీరు కారుస్తూ నాటకాలు ఆడుతుందని విమర్శించరు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు, రైతులు సరైన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## అవినీతి అధికారిని సస్పెండ్ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గిరిజన శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న హనుమకొండ, జనగామ జిల్లాలో డీటీడీఓగా పని చేస్తున్న ప్రేమకళా రెడ్డిపై చర్యలు తీసుకోవాలనీ లంబాడి హక్కుల పోరాట సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ గత మూడు సవత్సరాలుగా పని చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ అశ్రమ పాఠశాలలు పోస్టుమెట్రిక్ హాస్టల్ లో పనిచేస్తున్న వార్డెన్, కాంటిజెన్స్ ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతూ ఎలాంటి కారణాలు లేకుండా బదీలులు, సస్పెండ్ చేస్తూ ఉద్యోగులకు భయభ్రాంతులకు గురిచేసి లక్షల రూపాయలు వసూలు చేస్తుందని మండిపడ్డారు. ఒక్కొక్క వార్డెన్ కు రెండు మూడు హాస్టల్లో బాధ్యతలు ఇచ్చి, వారి దగ్గర నుంచి డైట్ బిల్లులలో 20 శాతం డబ్బులు వసూలు చేసి అక్రమ సంపాదనకు పాల్పడుతున్న అధికారినిపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బానోతు గోవింద్ నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బాధ్షావత్ భాస్కర్ నాయక్, మోహన్ నాయక్, రాజు నాయక్, ఈర్య నాయక్ పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో బీజేపీ ప్రచారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వరంగల్ - నల్లగొండ -ఖమ్మం గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మా రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కోర్టులో న్యాయవాదులను కలిసి ప్రచారం నిర్వహించి మొదటి ప్రాధాన్యత ఓటు బీజేపీకి వేసి ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్ బాబు, బీజేపీ రాష్ట్ర నాయకులు రావు అమరేందర్ రెడ్డి, లీగల్ సెల్ న్యాయవాదులు సి.విద్యాసాగర్ రెడ్డి, సంసాని సునీల్, అల్లం నాగరాజు, జువ్వాడి నర్సింగా రావు, కొత్త రవి, సంజీవ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ స్వాములకు అన్నదానం



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** శ్రీ భక్తాంజనేయ కుటీరం ఆధ్వర్యంలో హనుమాన్ మాల ధరించిన భక్తులకు 41 రోజు నిత్య అన్నదానం జరుపబడుతుందని హంటర్ రోడ్ న్యూ శాయంపేట హనుమాన్ ఆలయ స్వాములు తెలిపారు. పది మందితో మొదలైన ఈ కుటీరం ఈరోజు వరకు 800 పై చిలుకుగా హనుమాన్ మాల ధరించిన భక్తులకు నిత్య అన్నదానం జరుపబడుతుందని వారు తెలిపారు. కాబట్టి, అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదిగా ఈ కార్యక్రమాన్ని ఈనెల 30వరకు నిర్వమించబడుతుందన్నారు. దాతలు వస్తువు రూపంలో గానీ, నగదు రూపంలో గానీ అందజేసే వారు 9550020451, 8125984198లలో సంప్రదించగలరని వారు కోరారు.

## జర్నలిస్ట్ కుమారుడి జన్మదిన వేడుకలో సాయి కుమార్




**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ కమలాకర్ కుమారుడి మొదటి జన్మదిన వేడుకలో సాంబారి సాయికుమార్ పాల్గొన్నారు. రేగొండ మండల కేంద్రంలోని భూపాలపల్లి జిల్లా రాజ్ న్యూస్ ప్రతినిధి బండి కమలాకర్-అమల దంపతుల కుమారుడు సాయి ధనుష్ మొదటి జన్మదిన సందర్భంగా వారి ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ యువనేత సాంబారి సాయి కుమార్ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దీర్ఘాయుష్మాన్ భవ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో మంచిగా జీవించాలని వారి కుమారుడి ని ఆశీర్వదించారు.

# కుటుంబమే మొదటి విద్యాలయం

## సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మానవ సంబంధాల మధ్య అగాధాలు, పెరిగి మేషనరీ, మనీ సంబంధాలు పెరుగుతున్న ఈ సందర్భంలో భారతదేశంలోని కుటుంబ సంబంధాలు మాత్రమే వేల జీవితాలను కాపాడుతున్నాయని, కుటుంబంలోని అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు ఎన్నో జీవితాలు నిలబెడుతున్నారని ప్రముఖ సైకాలజిస్ట్, సైకాలజిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ అశోక్ మాట్లాడుతూ భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులైన కుటుంబాల్లోనీ పిల్లలు, అన్ని ఉండి ఒంటరి వాళ్ల వలె బతుకుతూ, మానసిక సమస్యలతో బాధపడుతూ చిన్నచిన్న సమస్యలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. చంద్ర మండలానికి ఇతర గ్రహాల మీదికి టూరిస్ట్ లా వెళ్తున్నామన్న మనిషి పక్క వాడి మనసును చేరుకోలేక సతమతమవుతున్నాడని, భారతదేశంలోని ప్రతి వ్యక్తి మన మూలాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. మన కుటుంబ వ్యవస్థ ఎంతో విలువైనదని అమ్మమ్మ తాతయ్యలు నానమ్మలతో పిల్లలు ఎంతో చనువుగా ఉంటూ వాళ్ల మానసిక ఒత్తిడిని డిశ్చార్జ్ చేసుకుంటారని, ఈ విషయాలను బాగా చదువుకున్నామన్న తల్లిదండ్రులు గమనించాలని తెలిపారు. ఏ కుటుంబంలోనైతే అమ్మమ్మ, నానమ్మలు ఉంటారో ఆ కుటుంబం ఎంతో సమన్వయంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. సామాజిక, ఆర్థిక, మానసిక సమస్యలకు పరిష్కారాలు వెతకడం కుటుంబ సంబంధాలతోనే సులువని ప్రతి ఒక్కరు గుర్తించాలని తెలిపారు. ఇటీవల భారత దేశంలో కూడా విడాకుల సంఖ్య పెరగడానికి కుటుంబ సంబంధాల లేమినే కారణమని, మనం ఎంత అభివృద్ధి చెందుతున్న కుటుంబ బంధాలు, ఆత్మీయత, ఒకరినొకరు కష్టసుఖాలు పంచుకునే అవకాశం కుటుంబ వ్యవస్థ ద్వారానే ఉంటుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని తెలిపారు.

# కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

## నకిరేకంటి మోహన్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు నకిరేకంటి మోహన్ గౌడ్ తెలిపారు. బుధవారం హనుమకొండలో ఆయన మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ కడియం కావ్య భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని అన్నారు . సోనియాగాంధీకి కృతజ్ఞతగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి సిద్ధమై ఓటు వేశారని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనేక ప్రలోభాలకు గురిచేసినా వరంగల్ ప్రజలు వాటిని లెక్కచేయకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశాంన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడానికి ముందుకెళ్తున్నారని తెలిపారు. కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం పక్కానని మోహన్ గౌడ్ స్పష్టం చేశారు.

# ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా ఓపీ గది




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మహబూబాబాద్ లో ప్రతి మంగళవారం ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా ఓపీ గది, ఓపీ సెక్షన్ గ్రౌండ్ ఫ్లోర్ లోని రూమ్ నంబర్ 15లో ఏర్పాటు చేయడం జరిగింది. కాబట్టి, ఈ సేవలను ట్రాన్స్ జెండర్లు ఉపయోగించుకోగలరని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు బుధవ్వారం ఒక ప్రకటనలో తెలిపారు.

# రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏషియన్ మాల్ పక్కన ఉన్న శ్రీ శిరిడి సాయి బాబా మందిరంలో "ఉచిత నేత్ర పరీక్ష శిబిరం" మాక్స్ విజన్, శరత్ ఐ హాస్పిటల్వారి నిర్వహణలో రేపు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించబడునని తెలిపారు. భక్తులు, ప్రజలు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరం వినియోగించుకొని అనుభవజ్ఞులైన, నిపుణులైన వారి నుంచి తగిన సూచనలు సలహాలు పొందగలరని సాయిబాబా మందిరం వ్యవస్థాపక చైర్మన్ మతుకుమల్లి హర గోపాల్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆన్ లైన్ జాబ్ పేరుతో జరిగే సైబర్ నేరాలపై అప్రమతంగా ఉండండి

## ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని ఒక మండలంలోని ఒక వ్యక్తికి తెలియని నెంబర్ నుంచి అమ్మాయి డీపీతో పార్ట్ టైం జాబ్ కావాలా అనే మెసేజ్ వచ్చింది. దానికి బాధితుడు సరే అని మెసేజ్ పెట్టగా, నేరస్తులు ఒక యూట్యూబ్ వీడియో లింక్ పెట్టి దాన్ని లైక్ అండ్ షేర్ చేసి దానికి సంబంధించిన స్క్రీన్ షాట్ ను తనకు పెట్టమని చెప్పగా బాధితుడు ఆ విధంగా చేశాడు. ఇలా మూడుసార్లు మూడు టాస్కులు చేయగా మూడు టాస్కులకు గాను రూ.150లకు సంబంధించిన విత్ డ్రా కోడ్ ను, దాన్ని విత్ డ్రా చేసుకొనుటకు ఒక టెలిగ్రామ్ ప్రొఫైల్ లింక్ను పంపించి ఆ వ్యక్తిని కాంటాక్ట్ అవ్వమని చెప్పగా, బాధితుడు ఆ లింకును క్లిక్ చేసి టెలిగ్రామ్ గ్రూప్ లోని ఒక లేడిని కాంటాక్ట్ అయ్యి, తన విత్ డ్రా కోడ్ ను తెలుపగా ఆమె బాధితుడు వ్యక్తిగత వివరాలు తెలుసుకొని రూ.150 లను బాధితుడి ఎకౌంట్ కు పంపించింది. తర్వాత బాధితుడిని ఒక టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. ఈ విధంగా టాస్కులను బాధితుడు చేత చేయిస్తూ ప్రతి మూడు టాస్కులకు గాను రూ. 150 లను పంపించి బాధితుని నమ్మించారు. ఇలా అతను చేత టాస్కులు చేయిస్తూ ఒక టాస్క్ లో మీరు కొంత మొత్తంలో డబ్బును ఇన్వెస్ట్ చేస్తే దానికి లాభాలను వస్తాయని చెప్పి మొదటగా కొంత లాభాన్ని బాధితుడి ఎకౌంట్ లో వేసి నమ్మించారు. ఆ గ్రూపులో సైబర్ నేరగాలందరూ ఉండి ఎవరికి వారు తెలినట్టుగా ఉంటూ వాళ్లు కూడా బాధితుల వలె ఇన్వెస్ట్ చేసి లాభాలు పొందుతున్నట్టు నటిస్తూ ఫేక్ స్క్రీన్ షాట్లను బాధితుడిని నమ్మించడానికి గ్రూపులో పెట్టారు. ఈ విధంగా బాధితుడి నమ్మకాన్ని సంపాదించారు. దానికి కొనసాగింపుగా అధిక మొత్తంలో ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని చెప్పసి బాధితుడి నమ్మించి బాధితుడు చేత లక్షల రూపాయలతో ఇన్వెస్ట్ చేయించారు. లాభాలు ఒక ఫేక్ వెబ్ సైట్ ద్వారా చూపించారు. అవి బాధితులు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అవి కాలేదు, మీరు ఇంకా కొంత అమౌంట్ జమ చేస్తే అన్నీ కలిపి మీకు చివరికి వస్తాయని నమ్మించి బాధితుడి చేత సుమారు రూ.12,00,000 వరకు మోసం చేశారు. చివరకు మోసాన్ని గమనించిన బాధితుడు 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఇదే తరహా టాస్క్ బేసిడ్ ఫ్రాడ్ లో మహబూబాబాద్ జిల్లాలోని మరో వ్యక్తి సుమారు రూ.32 లక్షలను పోగొట్టుకున్నాడు. ఈ విధంగా సైబర్ నేరుగాలు వివిధ రకాలుగా ఎత్తుగడలు వేసి బాధితులను మోసం చేసి అధిక మొత్తంలో డబ్బులను దోచుకుంటున్నారు. దీనిపై ప్రజలందరూ అప్రతంగా అవగాహనతో ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవేళ ఏమైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్ చేయడం ద్వారా లేదా www.cybercrime.gov.in వెబ్ సైట్ ద్వారా ఎంత తొందరగా ఫిర్యాదు చేస్తే అంతగా డబ్బులను కాపాడుకునే అవకాశం ఉంటుందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రజలకు సూచించారు.

# మన ఊరు మన బడి పనులకు బిల్లులు చెల్లించండి



**వరంగల్ వాయిస్, నడికూడ :** గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో మన ఊరు మనబడి ప్రారంభించడం జరిగింది. అందులో భాగంగా నడికూడ మండల కేంద్రంలో మన ఊరు మనబడి జిల్లా కలెక్టర్ మేరకు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, ఎంపీపీఎస్ స్కూల్ సెలెక్ట్ అయ్యాయి. ఈ క్రమంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్లో ఎలక్ట్రిషన్ క్లాస్ రూమ్ రిపేర్, డైనింగ్ హాల్, టాయిలెట్, కాంపౌండ్ వాల్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించారు. కేటాయించిన నిధులను కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్ ను పెట్టి గత సర్పంచులతో పనులు చేయించి సంబంధిత అధికారులచే రికార్డు చేయిస్తూ రికార్డు ప్రకారం బిల్లులు చెల్లించుకుంటూ పనులు చేయించడం జరిగింది. మిగిలిపోయిన పనులు పూర్తి చేసిన తర్వాత రికార్డు చేశారు. రికార్డు ప్రకారం కలెక్టర్ గత సంవత్సరం ఆగస్టు ఎఫ్ టీఓ జనరేటర్ చేయడం జరిగింది. ఎంపీపీఎస్ స్కూల్ శిథిలావస్థలో ఉన్న క్లాస్ రూమ్స్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం కోసం ఈజీఎస్, ఎస్ఎఫ్ సీ నిధులు మంజూరు చేశారు. ఈజీఎస్ నిధుల నుంచి కాంపౌండ్ వాల్ టాయిలెట్స్ పూర్తి చేసి,ఎస్ఎఫ్ సీ నుంచి నూతన తరగతి గదులను నిర్మించారు. వీటిని సంబంధిత ఇంజినీర్ అధికారులు రికార్డ్ చేసి ఆన్ లైన్ చేశారు. చేసిన పనులకు ఈజీఎస్ నిధులు విడతల వారీగా రావడం జరుగుతుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనులకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో చేసిన పనులు సర్పంచులు అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మన ఊరు మనబడి పక్కకు పెట్టి అమ్మబడి ఆదర్శ పాఠశాల పెట్టి తూతూ మంత్రంగా చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాబట్టి, వెంటనే కలెక్టర్ స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి తమ బిల్లులు ఇప్పించాలని బిల్లులు రాని సర్పంచులు కోరుతున్నారు.

# హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సమ్మయ్యకు సన్మానం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వద్యాలయ హాస్టల్ డైరెక్టర్ గా, ఫార్మసీ కళాశాల ఆచార్య డీన్ గాదె సమ్మయ్య బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సమ్మయ్య గతంలో డా.బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ గా, ఫార్మసీ కళశాల ప్రిన్సిపాల్, హెడ్ గా, బోస్ చైర్మన్ గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా, పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. ఆచార్య గాదె సమ్మయ్య బీ.ఫార్మసీ, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ కాకతీయ యూనిర్సిటీలో పూర్తిచేశారు. ఎం.ఫార్మసీ బనారస్ హిందూ యూనిర్సిటీ కాశీ పుణ్య క్షేత్రం, ఉత్తర్ ప్రదేశ్ లో చదివారు. ఆచార్య గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో మొత్తం ఏడుగురు పీహెచ్ డీ పూర్తి చేశారు. ఐదుగురు కొనసాగిస్తున్నారు. సుమారు 100 విద్యార్థిని విద్యార్థులు ఎం.ఫార్మసీలో వారి రీసెర్చ్ ను పూర్తి చేశారు. సమ్మయ్య ఆధ్వర్యంలో 73 నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ పబ్లికేషన్స్ ప్రచురించబడ్డాయి. రెండు రీసెర్చ్ గ్రాంట్స్, ఒకటి యూజీసీ నుంచి ఆంటీ క్యాన్సర్, ఆంటీ ఆక్సిడెంట్ ఆక్టివిటీ కోసం డీబీటీ నుంచి మరొకటి,యాంటీ హెచ్ఐవీ ఆక్టివిటీ కోసం కొత్త మాలికూల్ ను కనుగొనుటకు సుమారు రూ.26 లక్షల వరకు గ్రాంట్ మంజూరు చేయబడింది. పేదరికం నుంచి వచ్చి ఫార్మసీ కళాశాల డీన్, హాస్టల్ డైరెక్టర్ గా నియమితులైన ఆచార్య గాదే సమ్మయ్య విద్యార్థిని విద్యార్థుల సమస్యలు తెలుసుకొని, వారికి నాణ్యమైన భోజనం, వసతి, సంపూర్ణ ఆరోగ్యం ఉండే విధంగా తగు జాగ్రత్తలు, చర్యలు తీసుకుంటారని పలు విద్యార్థిని విద్యార్థులు సంతోషం వ్యక్తపరిచారు. అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది పేదవారి చదువుకు ఆర్థిక సహాయం చేస్తూ, వారు చదువులో ముందుండేలాగా ప్రోత్సహిస్తూ, వారి ఆరోగ్య విషయమై సంపూర్ణ రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తూ, నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విద్యార్థిని విద్యార్థులకు తన సేవలు అందిస్తానని తెలిపారు. హాస్టల్ డైరెక్టర్ గా నియమితులైన ఆచార్య సమ్మయ్యకు డాక్టర్ ఎల్.పీ రాజ్ కుమార్, డాక్టర్ సూర్య నారాయణ, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ బ్రహ్మయ్య, డాక్టర్ సురేష్, డాక్టర్ మధుకర్ రావు, డాక్టర్ రామచందర్, డాక్టర్ రాధిక, డాక్టర్ ఉషా కిరణ్మయి, స్వప్న, లక్ష్మి, అన్ని హాస్టల్స్ కేర్ టేకర్స్, హాస్టల్ ఆఫీస్ సిబ్బంది రజిత, భాస్కర్, చిరంజీవి, నవీన్, విద్యార్థిని విద్యార్థులు, పలువురు ఆచార్య సమ్మయ్యకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

# కుటుంబాన్ని మించిన బలం లేదు



## నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఏ వ్యక్తికైనా బలం... బలగం... తన కుటుంబం. కుటుంబం అంటే పెద్ద బలగం అని, స్నేహితులు, బంధువుల సమూహం అని అర్థం. ఇటీవల వచ్చిన బలగం సినిమా... కుటుంబ ప్రాధాన్యతని, కుటుంబంలోని వ్యక్తులంతా కలిసివుంటే...అదే బలగం అని చెప్పింది. 'నా ఇంటి పేరు ప్రపంచం/ ప్రజలే నా కుటుంబం/ వెదజల్లుతా దిగ్దిగంతం/ అభ్యుదయ సుగంధం అప్పుడు నా జీవితమే ఒక ప్రబంధం' అంటారు సినారె. సంతోషం, బాధ, దుఃఖం, ప్రేమ, అనుబంధాలు, కలహాలు, ఆత్మీయతలు ఇవన్నీ ఒకేచోట కలిసుండేదే కుటుంబం. భిన్న రకాల మనస్తత్వాలు, అభిప్రాయాలున్న వ్యక్తులను ఒకేచోట అనుబంధంగా మర్చేస్తుంది కుటుంబం. మన భారతీయ కుటుంబం.. అంతులేని శక్తికి, బలానికి సూచికగా నిలుస్తోంది. పిల్లల ఆనందాన్ని తమ సంతోషంగా భావించే తల్లిదండ్రులు, కన్నవారి కలలను సైతం నెరవేర్చాలనే తపన పిల్లలది. ఇలా ఎల్లప్పుడూ ప్రేమ ఆత్మీయతలతో కలిసుండేది ఫ్యామిలీ. ఇక మన భారతీయ సంప్రదాయంలో ఉమ్మడి కుటుంబాలు ప్రత్యేకం. మే 15 అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం. మరి ఈరోజును ఎందుకు జరుపుకుంటారు.. 1983లో ఐక్యరాజ్య సమితి చూపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుటుంబాల వైపు మళ్లింది. ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్, సోషల్ డెవలప్ మెంట్ కమిషన్ అప్పటి సెక్యూరిటీ జనరల్ కుటుంబాల సమస్యలు, వారి అవసరాల గురించి మరింత అవగాహన పెంచుకోవాలను కుంది. మే 29, 1985న ఆమోదించిన తీర్మానంలో కౌన్సిల్ సిఫారసు పై జనరల్ అసెంబ్లీ అభివృద్ధి పక్రియలో కుటుంబాలు అనే అంశాన్ని కూడా చేర్చారు. డిసెంబర్ 1989లో ప్రతి సంవత్సరం మే 15న జరుపుకునే అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రకటించింది. ఉమ్మడి కుటుంబాల్లో వలె కలిసి మెలిసి ఉండే మనసు కానీ, మనుషులు కానీ లేకుండా పోయారు. పెండ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకొని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫోన్ పట్టుకొని ఒంటరైపోతున్నారు. సలహాలిచ్చే పెద్దవారు లేక, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు రాక, బాధలను పంచుకునే బంధువులు లేక ఒంటరిగా మారుతున్నారు. చిన్న సమస్యలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక్కడే ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యం తెలిసి వస్తున్నది. కుటుంబ వ్యవస్థతో మన సంస్కృతిని పిల్లలకు అందజేయడం, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం చేయాలి. ఇదే మానవీయ సమాజ ఉన్నతికి మూలం.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ట్రయల్ రన్



## విజయవంతంగా చేపట్టిన అధికారులు

**వరంగల్ వాయిస్, యాదాద్రి :** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అధికారులు రెండు యూనిట్లకు విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. ప్లాంట్‌కు అవసరమైన మెటీరియల్ సరఫరా, రైల్వే, రోడ్డు రవాణా వ్యవస్థలను త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైతే ప్రత్యేక పాలసీ తీసుకునేందుకు సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఉన్న రెండు యూనిట్లకు సంబంధించిన యాక్సిలరీ బాయిలర్లను లైట్ అప్ చేశారు . దీంతో యాదాద్రి ఎ %-%లాంట్ పవర్ జనరేషన్‌లో చారిత్రక ఘట్టం మొదలైంది. దశల వారీగా పవర్ జనరేషన్ చేపట్టి త్వరలో గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. ఇటీవలే యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిచ్చింది. దీంతో జెన్ కో విద్యుత్ ఉత్పత్తికి సన్నాహాలు చేసింది. దీనిలో భాగంగా మొదటి విడతగా 800 మెగావాట్లను ఉత్పత్తి చేసే రెండు యూనిట్లతో 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ రెండు యూనిట్లకు సంబంధించిన యాక్సిలరీ బాయిలర్లను లైట్ అప్ చేశారు. ఆ తర్వాత రెండో విడతలో మరో 800 మెగావాట్ల మూడు యూనిట్లతో 24,00 మెగా వాట్లు ఉత్పత్తి చేయనున్నారు. మొత్తంగా యాదాద్రి థర్మల్ పవర్ ఎ%-%లాంట్ నుంచి 4,000 మెగావాట్ల కెపాసిటీతో యాదాద్రి పవర్ ఎ%-%లాంట్ ఏర్పాటైంది. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైటీపీఎస్ పనుల పురోగతిని పరిశీలించిన విషయం తెలిసిందే. వైటీపీఎస్‌లో ముగ్గురు మంత్రులు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఎ%-%లాంట్‌లో యూనిట్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉంది.. బొగ్గు తరలించే రైల్వే ట్రాక్ నిర్మాణ పురోగతి, గతంలో జరిగిన పనుల బిల్లుల చెల్లింపులు, రానున్న కాలంలో జరగాల్సిన పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై మంత్రులు సమీక్షించారు. ఇంకా ఎంత మందికి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది.. తదితర అంశాలతో ప్రపంచం మొత్తం హరిత విద్యుత్, పునరుత్పాదక ఇంధనం వైపు దూసుకుపోతుంటే గత పాలకులు థర్మల్ పవర్ పై దఅష్టి సారించారు. వివిధ కారణాలతో జాప్యం చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిరదని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్లాంట్‌లో నైపుణ్యం, నైపుణ్యం ఉన్న వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# శ్రీ దొప్ప లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో 21 నుంచి ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని బ్రాహ్మణ వాడలో గల దేవాలయంలో 21, 22, 23న మంగళవారం, బుధవారం, గురువారం రోజులలో నారసింహ జయంతి, సుదర్శన హోమం, లక్ష్మీ నారసింహ కళ్యాణం నిర్వహిస్తున్నరు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధన రూపేణ సహాయ సహకారాన్ని అందించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని, డబ్బులు 9866051280 నెంబర్ కు పంపగలరని, అలాగే గోత్రనామాలు కూడా ఖచ్చితంగా పంపాలని దేవాలయ నిర్వాహకులు తెలిపారు.



# పది రోజులు పాటు థియేటర్లు బంద్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు ప్రేక్షకులకు తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ ఊహించని షాక్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో పది రోజుల పాటు థియేటర్లు బంద్ కానున్నాయి. ఆక్యుపెన్సీ తక్కువ ఉండటంతో తెలంగాణ రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు తాత్కాలిక విరామం ప్రకటించాయి. శుక్రవారం నుంచి పది రోజులపాటు షోలు వేయవద్దని తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు అలాగే ఇతర కారణాలతో ఇటీవల పెద్ద సినిమాలు రిలీజ్ కావడం లేదు. దీంతో సినిమా హాళ్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నగరాలతో పోలిస్తే పట్టణాలు అలాగే మండలాలలో ఇది మరింత దారుణంగా ఉందంటూ.. తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ ఈమేరకు నిర్ణయం తీసుకుంది.

# కేయూ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నిరంజన్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) డాక్టర్ బి.నిరంజన్ శ్రీనివాస్ కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. 21 సంవత్సరాలుగా యూనివర్సిటీ అధ్యాపకుడిగా వీరు పని పనిచేస్తున్నారు. ప్రస్తుతం సుబేదారి పీజీ కాలేజీలో విద్యా బోధన చేస్తున్నారు.




# ఫ్రీజింగ్ ఎగ్స్‌పై తప్పుడు వార్తలు

## అసమనం వ్యక్తం చేసిన నటి మెహరీన్

తన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని నటి మెహరీన్ పిర్జాదా మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా వారు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. ఇటీవల ఆమె 'ఎగ్ ఫ్రీజింగ్' గురించి వివరిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. దానిపై కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు రాశాయి. తాజాగా ఈ విషయంపై స్పందించిన మెహరీన్.. అసహనం వ్యక్తం చేశారు. 'కొన్ని మీడియా సంస్థల్లో పనిచేసే వారు వారి వృత్తిని గౌరవించాల్సిన అవసరం ఉంది. అర్థం చేసుకుని వార్తలను ప్రచురించండి. తప్పుడు సమాచారాన్ని ప్రజలకు అందించడం అనైతికమే కాదు.. చట్ట విరుద్ధం. ఇటీవల నేను పెట్టిన 'ఫ్రీజింగ్ ఎగ్స్' పోస్ట్‌పై కొందరు రకరకాల వార్తలు రాశారు. నేను ధైర్యం చేసి ఈ విషయం గురించి మాట్లాడాను. ఫ్రీజింగ్ ఎగ్స్ కోసం అమ్మాయిలు గర్భవతులు కావాల్సిన అవసరం లేదు. బాధ్యతయుతమైన సెలబ్రిటీగా కొందరికి దీని గురించి అవగాహన కల్పించడం కోసం పోస్ట్ పెట్టాను. పిల్లలు అప్పుడే వద్దని భావించే తల్లి దండ్రులకు ఎగ్ ఫ్రీజింగ్ పద్ధతి ఉపయోగపడుతుంది. దీని గురించి తెలియకుండా మీ స్వార్థం కోసం తప్పుడు కథనాలు రాశారు. నేను ప్రెగ్నెంట్ అని ప్రచారం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి వార్తలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నాపై పెట్టిన పోస్ట్‌లను తొలగించండి. బహిరంగ క్షమాపణలు చెప్పండి' అని మెహరీన్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. నెటిజన్లు ఆమెకు సపోర్ట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

# వారంలో ఒక్క రోజు మాత్రమే


వారంలో ఒక్క రోజు మాత్రమే తనలోని కోపాన్ని చూపించే సూర్య అనే యువకుడిగా తెరపై సందడి చేయనున్నాడు... నాని. కోపానికి ఆ ఒక్క రోజే ఎందుకో తెలియాలంటే మాత్రం 'సరిపోదా శనివారం' చూడాల్సిందే. నాని కథానాయకుడిగా... వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రియాంక మోహన్ కథానాయిక. డి.వి.వి.దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పతాక సన్నివేశాల్ని హైదరాబాద్‌లో తెరకెక్కిస్తున్నారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన భారీ సెట్‌లో... నాని, ఇతర తారాగణంపై పోరాట ఘట్టాల్ని చిత్రీకరిస్తున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. 'నాని మునుపెన్నడూ చేయని సూర్య అనే ఓ శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 29న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ'ని ఓ ప్రకటనలో స్పష్టం చేశాయి. ఎస్.జె.సూర్య, సాయికుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: మురళి.జి, కూర్పు: కార్తీక శ్రీనివాస్, పోరాటాలు: రామ్ లక్ష్మణ్.



# ట్రైలర్ చూసి భయపడ్డా



ఓషో తులసిరామ్ తెరకెక్కించిన 'దక్షిణ' మూవీ ట్రైలర్ చూసి భయపడ్డానని అన్నారు యంగ్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా. 'మంత్ర, మంగళ' సినిమాలతో తెలుగు చలన చిత్ర రంగంలో లేడీ ఓరియెంటెడ్ మూవీస్‌కి ఒక ట్రెండ్ క్రియేట్ చేసిన డైరెక్టర్ ఓషో తులసిరామ్. ఈ మధ్య కాస్త గ్యాప్ తీసుకున్న ఆయన మళ్లీ 'దక్షిణ' మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కల్ట్ కాన్సెప్ట్స్ మూవీ బ్యానర్ నిర్మాణంలో అశోక్ షిండే నిర్మించిన ఈ సినిమాలో 'కబాలి' ఫేమ్ సాయి ధన్షిక హీరోయిన్ కాగా.. 'మహాభారత్ మర్డర్స్' ఫేమ్ రిషవ్ బసు మరొక ముఖ్య పాత్రలో నటించారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. టీజర్ విడుదల అనంతరం బుచ్చిబాబు మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో నన్ను బయపెట్టిన ట్రైలర్ ఇదే. మళ్లీ తులసి రామ్‌గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ని 'దక్షిణ' సినిమాతో ఇవ్వబోతున్నారు. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. అనంతరం నిర్మాత అశోక్ షిండే మాట్లాడుతూ.. బుచ్చిబాబుకు ధన్యవాదాలు తెలిపారు. 'దక్షిణ' సినిమా సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది, నెక్ట్స్ ఏం జరుగుతుంది? అనే సస్పెన్స్ ప్రేక్షకుల్లో కలిగించేలా ఉండే ఈ సినిమాను త్వరలోనే థియేటర్లలోకి తీసుకువస్తాం. ఈ సినిమా విడుదల ఎప్పుడనేది అతి త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాత అశోక్ షిండే (ంబరనీ ఊరతినిట।) చెప్పుకొచ్చారు. చిత్ర గ్లింప్స్‌కు, అలాగే ఇప్పుడు విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాతలతో పాటు చిత్ర బృందం పాల్గొన్నది.




# గేమ్ ఛేంజర్

## పూర్తి చేసే పనిలో రామ్‌చరణ్

చాలా రోజులుగా సెట్స్‌పై ఉన్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. సినీ ప్రేమికులు... అభిమానులు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతుండడం.... అందులోనూ శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమా అంటే... అందులో భారీ హంగులు ఖాయం. వాటిని పక్కాగా తెరపైకి తీసుకు రావడంలో ఏమాత్రం రాజీపడరు శంకర్. అందుకే ఈ సినిమా చిత్రీకరణ ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలంగా ఈ సినిమాపై ప్రత్యేకంగా దృష్టి సారించారు రామ్‌చరణ్. శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. తుదిదశకు చేరుకున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇటీవలే రామోజీ ఫిల్మ్‌సిటీలో కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. ప్రస్తుతం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణంపై సన్నివేశాల్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రామ్‌చరణ్ సరసన కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణని పూర్తి చేసి, వచ్చే నెల నుంచి కొత్త సినిమా చిత్రీకరణ కోసం రంగంలోకి దిగనున్నారు రామ్‌చరణ్. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందనున్న ఆ సినిమా ఇప్పటికే లాంఛనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. 'గేమ్‌ఛేంజర్' పూర్తయిన వెంటనే, కొత్త సినిమాకి తగ్గట్టుగా లుక్ మార్చుకుని, ఆ వెంటనే సెట్‌లోకి అడుగు పెట్టనున్నారు.

# అకాల వర్షంతో ఆగం
# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

**కొట్టుకుపోయిన వడ్లు**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ అన్నదాతలు**

**పలుచోట్ల నిరసనలు.. ధర్నాలు.. రాస్తారోకోలు**

**బీబీనగర్ వద్ద జాతీయ రహదారిపై ధర్నాతో నిలిచిపోయిన ట్రాఫిక్**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం సాగుతోంది. దీంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వరిధాన్యం తడిసి ముద్దయింది. కల్లాల్లో పోసిన ధాన్యంతో పాటు, మార్కెట్ యార్డుల్లోనూ ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఐకేపీ కేంద్రాల వద్ద ఉన్న వరిధాన్యం సైతం తడిసి పోయింది. పలుచోట్ల కొట్టుకు పోయింది. అంతేకాకుండా తేమ శాతం కూడా పెరిగింది. దీంతో రైతులు లబోలదిబోమంటున్నారు. ధాన్యం కొంటామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ కొనుగోళ్లలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా.. తడిసిన వరిధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరుతూ కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో రైతులు ఆందోళన చేశారు. 20 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకొచ్చినా కొనుగోలు చేయడం లేదంటూ ఆరోపిస్తున్న రైతులు రోడ్కెక్కారు. ఇప్పటి వరకు 20 శాతం కూడా కొనుగోలు పూర్తి చేయలేదు. ఇప్పుడు వాతవరణం కూడా మారిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రానున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభంకానుంది. వెంటనే.. పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల వరిధాన్యం కొనుగోలు చేసినా.. సకాలంలో డబ్బులు రావడం లేదు. నాలుగైదు రోజుల్లో వరిధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం ఎలాంటి ఆందోళన చెందవద్దని రైతులకు సూచిస్తున్నారు. పూర్తి స్థాయిలో పరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హావిరీ ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. సకాలంలో వరిధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అకాల వర్షాల కారణంగా వరిధాన్యం తడిసిపోయిందని రైతులు చెబుతున్నారు. తేమ శాతం పేరుతో సరిగా కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. వెంటనే పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనేకచోట్ల ఇదే పరిస్థితి ఉండడంతో ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి పంటలు పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో ప్రభుత్వంపై మండి పడుతున్నారు. కండ్ల ముందే పంటలు పాడవుతున్నా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు ఆందోళన బాటపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తూ, రోడ్లపై బైఠాయిస్తూ తమ నిరసనను తెలుపుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో అన్నదాతలు ఆందోళన బాటపట్టారు. నెల గడుస్తున్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు బుధవారం బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. స్థానిక తహసీల్దార్ శ్రీధర్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హావిరీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, అంతకుముందు భువనగిరి మండలం పచ్చళ్లపాడు తండా గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వడ్లు కొనకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





## స్ట్రాంగ్ రూంల తనిఖీ

**లాగ్ బుక్‌లను పరిశీలించిన కలెక్టర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం తనిఖీ చేశారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించి అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల షట్టర్ల తాళాలకు వేసిన సీళ్లను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన లాగ్ బుక్ లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఉన్న సీసీ కెమెరాల పర్యవేక్షణకు సంబంధించిన వాచ్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూములు, భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ వివరాలను ఆయా నియోజకవర్గాల ఏఆర్వోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ తోపాటు తహసిల్దార్లు విజయ్ కుమార్, జగన్మోహన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతులపై ఇంత నిర్లక్ష్యమా

**తడిసిన ధాన్యం కొనడంలో ఎందుకీ ఉదాసీనత**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్**




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరించి రాజకీయాలపైనే దృష్టి పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. రైతులు ఆందోళన చెందుతున్నా చీమకుట్టినట్లుగా లేదన్నారు. బుధవారం హైదరాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ల పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. తరుగు పేరుతో క్వింటాల్‌కు మూడు కేజీలు తీస్తున్నారని.. రైతులకు అన్యాయం చేయొద్దని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ రోడ్డెక్కి ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. గతంలో తరుగుపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు ఇప్పుడు ఎందుకు పట్టించుకోరని అన్నారు. ఇకపోతే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నాలుగు సార్లు బీఆర్ఎస్ మాత్రమే గెలిచిందని తెలిపారు. కేసీఆర్‌కు బలాన్ని చేకూర్చేలా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మెగా డీఎస్సీ దగా అయిందన్నారు. ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు తానే ఇచ్చినా అని రేవంత్ రెడ్డి అబద్దాలు చెబుతున్నారన్నారు. ప్రశ్నించే గొంతు.. పార్టీ ఉంటేనే ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు. ఒక బ్లాక్ మెయిలర్‌ను కాంగ్రెస్ పార్టీ పోటీలో పెట్టిందని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే నల్గొండలో నయీమ్ లాంటి వ్యక్తిని తయారు చేసినవాళ్ళం అవుతామన్నారు. ఉద్యోగులను ముఖ్యమంత్రి నిందించటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి దిక్కుమాలిన మాటలు మాట్లాడొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ ఖేడ్‌లో టీచర్లపై లాఠీ ఛార్జ్ చేస్తారా అంటూ మండిపడ్డారు. మూడు లక్షల ఎనభై కోట్ల అప్పు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసిందని రిజర్వ్ బ్యాంకు నివేదిక రిలీజ్ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్లు అంటూ ఫేక్ ప్రచారం చేస్తోందన్నారు. దీనికి సీఎం, డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఊసరవెల్లిలా మాట్లాడుతున్నారన్నారు. హైదరాబాద్ విషయంలో బీజేపీ ఏం చేయబోతుందో జూన్ 4 తర్వాత తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## త్వరలో కొత్త రేషన్ కార్డులు

**బియ్యంతోపాటు మరి కొన్ని సరుకుల పంపిణీ**

**సీఎం రేవంత్ రెడ్డి**




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని కార్డులులేని నిరుపేదలందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అదే విధంగా రేషన్ కార్డు ఉన్నవారికి ఆయన గుడ్‌న్యూస్ చెప్పా రు. ఇప్పటి వరకు రేషన్ సరుకులుగా బియ్యం, చక్కెర, కొన్ని ప్రాంతాల్లో గోదుమలు ఇస్తుండగా వీటితోపాటు మరికొన్ని సరుకులు అదనంగా ఇస్తామని సీఎం ప్రకటించారు. రేషన్ దుకాణాల్లో ఎక్కువ వస్తువులను సబ్సిడీకి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో రాజకీయాలు అయిపోయానని నేటి నుంచి ప్రజాపాలనపై దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా రైతులు, తాగు నీరు, సాగు నీరు, విద్యార్థులు తదితర అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. రైతు రుణమాఫీపై గతంలో ఇచ్చిన హామీని కచ్చితంగా నిలబెట్టుకుంటామని వెల్లడించారు. ఆగస్టు 15 లోపు రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. రైతులు అధైర్య పడొద్దన్నారు. ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని వెల్లడించారు. మిల్లర్లు అక్రమాలు చేస్తామంటే ఉరుకునేది లేదని.. తాట తీస్తామని హెచ్చరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com